# సెప్టెంబరు 5

-కుసుమ కె. మూర్తి



"**ఈ వేళ** సెప్టెంబర్ 5 వ తేది. మహా మేధావి, మితభాషి అయి ఉండి, భారత రాజకీయాకాశంలో చల్లని వెన్నెల వెలుగులు వెద జల్లే చందమామలా ప్రకాశించి, అపారమైన కీర్తిని ఆర్జించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పుట్టిన రోజు ఈ రోజేనని మీ కందరికి తెలుసు. మొదట్లో ఆయన అధ్యాపక వృత్తిని చేపట్టారని, అందుకే ఆయన పుట్టిన రోజును గురు పూజోత్సవ దినంగా పరిగణించడం జరిగిందనికూడా మీ కందరికీ తెలుసని నా నమ్మకం. ఈ పవిత్రమైన రోజున పండుగ జరుపుకోవటం మన అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సందర్భంలో పూజ్యులు, గురువులకు గురువు అయిన శ్రీ వీరభద్రరావుగారిని సన్మానించాలని తీర్మానించటం, ఆ సన్మాన సభకు నేను కార్యదర్శిని కావటం నేను పూర్వజన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను. వారిని వేదిక మీదికి వచ్చి సన్మాన పీఠాన్ని అలంకరించ వలసిందిగా కోరుతున్నాను."

వీరభద్రరావుగారు కళ్ళజోడు ఒక మాటు, ఉత్తరీయం ఒక మాటు సవరించుకుని, పంచె కొద్దిగా పైకి పట్టుకుని, మెల్లగా మెట్లెక్కి తనకు ఏర్పాటుచేసిన కుర్చీలో కూర్చున్నారు. కూర్చునే ముందు కాస్త తటపటాయించినట్టు కనపడ్డారు. అందుకు ఈ జన్మలో ఆ కుర్చీలో కూర్చోవటం ఇదే మొదటి మాటు, ఇదే ఆఖరి మాటు కావటం కారణం కావచ్చు. లేదా ఆకుపచ్చ వెల్వెట్‌తో కుట్టబడి, కనకాంబరాలతో, గులాబీలతో అలంకరించబడిన విశాలమైన కుర్చీ కావచ్చు. అది కుర్చీయా! కాదు. రాజులు, చక్రవర్తులు కూర్చునే సింహాసనం! అందుకే పాపం! ఆయన కాస్త తటపటాయించి ఉంటారు. అయినా కాళ్ళూ చేతులే వణుకుతున్నాయో, మనస్సే వణుకుతూందో, గుండె దడ దడ లాడుతూందో—పైకి మాత్రం ఏమీ కనపడకుండా చక్కగా కుర్చీలో కూర్చున్నారు. సింహాసనం చేతులకు కట్టిన దట్టమైన గులాబీ మాలలు తన చేతులకు తగులుతూంటే ఏమిటో విచిత్రానుభూతి కలుగుతూంది. పురుషుడు కదా? గులాబీలు ఎప్పుడూ ముట్టుకునే అవసరం ఆయనకు కలగలేదు.

జీవితంలో గులాబీ చెట్లెప్పుడు పెంచాడు కనక? పూజకు తులసీ దళాలే కాని పూలెక్కడివి? అందులోనూ గులాబీ పూలెక్కడివి? పెళ్ళయిన




కొత్త రోజుల్లో కాబోలు భార్యకు రెండు మూడు మూట్ల చామంతి పూలు తీసుకువచ్చాడు. పెళ్ళి రోజుకూడా గులాబీదండలు వేసుకోలేదు. ఒక చెమ్కీ దండల జత అత్తవారు వేయించారు. ఒక చామంతి దండల జత తన వాళ్ళు వేయించారు. ఇప్పటివాకా తను గులాబీలే ముట్టుకోలేదన్న పరమ సత్యాన్ని ఇప్పుడే— ఈ క్షణమే తెలుసుకున్నాడు ఆయన.

అంతలో కరతాళ ధ్వనులు. తల ఎత్తి అందర్నీ చూశాడు. వేదిక మీద కూర్చున్న వాళ్ళుకూడా చప్పట్లు కొడుతున్నారు. ఏమిటోగా ఉంది. ఇంతలో ఇందాకటి కార్యకర్త ఒక చిన్న పిల్ల చేత నిలువెత్తు గులాబీ దండ తన మెడలో వేయించాడు. మళ్ళీ కరతాళ ధ్వనులు. ఏమిటో ఎబ్బెట్టుగా ఉంది. దండ వేసిన ఆ అమ్మాయిని ఎత్తుకుని నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి బుడి బుడి నడకతో వెళ్ళిపోయింది. చదువుకూ, రాజకీయ నాయకులకూ చుక్కెదురేమో తెలియదు! కనీసం కొంత మంది విషయంలో నైనా ఇది నిజం అన్నది నిజంగా నిజం. మంత్రిగారు ఉపన్యాసం మొదలు పెట్టారు.

"ఈ వేళ టీచర్ల దినం."

"మంత్రిగారు టీచర్లకి దినాలు పెట్టేస్తున్నారోయ్!" వెనక నుంచి ఎవడో గడుగ్గాయి గట్టిగా అరిచాడు. వాలంటీర్లు వాణ్ణి పట్టుకుని బయటికి ఈడ్చుకు వెళ్ళారు—పోలీసులకి అప్పగించటానికేమో! వాణ్ణి చూస్తుంటే చదు వంటక రోడ్లు పట్టుకుని తిరిగే జులాయి కొడుకు జ్ఞాపకం వచ్చాడు. ఎవరైనా నోరెత్తితే క్రూరతతో తల మీద త ంగువునిపిస్తున్నారు.

"మనం గురువులను పూజించాలి. పిల్లకాయలను తీర్చిదిద్దేది పంతుళ్ళే కదా? పంతుళ్ళు సమాజానికి అంటే దేశానికి ఎనలేని సేవ చేస్తున్నారు. ఇంత నిస్వార్థ సేవ చేస్తున్న ఈ పంతుళ్ళ ఋణం ఏమిచ్చినా తీర్చుకోలేం."

వీరభద్రరావు గారి స్వగతం: 'ఏమిచ్చినా తీరని ఋణం. అవును, మరి. అందుకే ఆరు నెలల నుంచి జీతాలుకూడా ఇవ్వటం లేదు. అందుకని మేము అప్పులు చేసుకుని ఋణపడి పోతున్నాం. మా ఋణం మీ రెలా తీర్చుకో గలరు? మేము చేస్తున్న ఋణం మేము మాత్రం ఎలా తీర్చుకోగలం?"

మంత్రిగారి మాటలు మళ్ళీ వినిపించాయి.

"ఏదో ఉడతా భక్తిగా ఈ కాశ్మీరు శాలువను మీ అందరి తరఫునా, ప్రభుత్వం తరఫునా, నా తరఫునా పంతులు గారికి సమర్పిస్తున్నాను. ప్రతి ఏడూ మీరు ఇలాగే సత్కారాలు అందుకోవాలని కోరుతున్నాను."

వీరభద్రరావుగారి స్వగతం: 'పంచెల చాపైనా అయితే బాగుండును. ఆరు నెలలో ఏడాదో కట్టుకుందును. ఎప్పుడూ ఉక్కబోసే ఆంధ్రలో ఈ కాశ్మీరు శాలువ ఏం చేసుకోను? మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగ నూనె.హుఁ!'

మంత్రిగారికి వెండి పళ్ళెంలో శాలువ తెచ్చి అతి వినయంగా అందించారు ఒక అధికారి. ఆ శాలువ మడతను ఆయన విప్పబోతుంటే నలుగురైదుగురు పరుగెట్టుకొచ్చారు, శాలువ విప్పటంలో మంత్రి గారికి సాయం చెయ్యటానికి. ఆయన చల్లని చూపులు తమ మీద పడితే చాలు మరి దశ తిరిగిపోతుంది!

మంత్రిగారి చలువ చేతితో, చలువరాయిలాంటి తెల్లని కాశ్మీరు శాలువ పంతులు గారి మెడ చుట్టూ అలంకరించబడింది. తను చిరునవ్వుతో మంత్రి గారికి నమస్కారం చేశాడు. ఆ చిరునవ్వు వెనక అగ్ని పర్వతాలు బద్దలవుతున్నాయని, ఎ. సి. కార్లలో తిరుగుతూ ఎ. సి. ఇళ్ళలో ఉంటూ, ఫ్రిజులోని చల్లని పానీయాలను సేవించే మంత్రి గారి చల్లని మనస్సుకేం తెలుసు, పాపం! అదెప్పుడో ఫ్రిజ్ అయిపోయింది.

ఒక తెల్ల యూనిఫారం వెండి పళ్ళెంలో ఆరు ఆపిల్ పళ్ళు తెచ్చి టేబుల్ మీద పెట్టి మంత్రి వర్యులకు దండం పెట్టి వెళ్ళిపోయింది. మంత్రి గారు కార్యకర్తను ఉద్దేశించి ఏదో సంజ్ఞ చేశారు. కార్యకర్త లోపలికి పరుగెట్టి వెళ్ళి క్షణంలో ఒక చిన్న పిల్లవాడితో స్టేజి మీదికి వచ్చారు. ఆ పిల్లవాడు వెండి పళ్ళెం పుచ్చుకొని, గురువుగారి దగ్గరికి వచ్చి ఆ పళ్ళు ఒక్కొక్కటే తీసి వారి చేతిలో పెట్టాడు. వాడి చేతిలోని వెండి పళ్ళాన్ని తెల్ల యూనిఫారం తీసుకొని వేదిక వెనక్కు వెళ్ళిపోయింది. వీరభద్రరావు గారి స్వగతం: ఆ ఆరు పళ్ళు వాళ్ళు తీసుకొని వెండి పళ్ళెం నా కివ్వకూడదూ? నా అప్పులు కొన్ని తీరతాయి. ఆ పళ్ళలో ఉండే పోషకాహారం కంటే వెండి పళ్ళెంలోనే ఎక్కువ పోషకాహారం ఉంది. అది వాళ్ళకు తెలుసేమో? అందుకే దాన్ని అట్టే పెట్టుకొని పళ్ళు మాత్రం నా కిచ్చారు.

ఆ అబ్బాయి వంగి తన కాళ్ళకు దండం పెట్టాడు. వెంటనే మెరుపులా మంత్రిగారు కూడా వచ్చి తన కాళ్ళకు దండం పెట్టారు! అమ్మయ్యో! ఇంకేమైనా ఉందా? తన బోటి అల్పుడికి అంతటి అధికుడు దండం పెట్టారు. మిగతా వాళ్ళు పెట్టకపోతే బాగుండదనుకున్నారేమో పెద్ద హోదా గల ఆఫీసర్లు, కార్యదర్శి మిగతా కార్యకర్తలు ఎంతోమంది టీచర్లు, ప్యూన్లు, విద్యార్థి నాయకులు అంతా క్యూలో నిలబడి మరీ దండం పెట్టారు! తను అస్పష్టంగా గొణుక్కుంటున్నాడు. అవి దీవెనలని వాళ్ళంతా భ్రమపడుతున్నారు. తన స్వగతం వాళ్ళకేం తెలుసు? తను బహిర్గతం చేస్తే కదా!

తులసి మొక్కకు కుంకం పసుపు పెట్టి అక్షతలు జల్లి, రెమ్మల్లో పూలు పెట్టి, మూడు ప్రదక్షిణాలు చేసి, బెల్లమో పంచదారో నైవేద్యం పెట్టి, ఒక గ్లాసుడు పవిత్రమైన మడి నీళ్ళు తులసి మొక్కలో పోసి, ఒక తులసి ఆకు తెంపి నోట్లో వేసుకొని, దండం పెట్టుకొని, ఇంట్లోకి వెళ్ళిపోయే తన భార్య హైమవతితో తను అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"హైమా! తులసి మొక్కను ముందు ప్రాణం ఉన్న ఒక మొక్కగా చూడవే. దానికి కావలసిన నీరు సమృద్ధిగా పొయ్యి. ఏపుగా ఎదగటానికి సారవంతమైన మట్టి పొయ్యి. లేదా ఎరువు వెయ్యి. ఆ తరవాతే పూజా పునస్కారాలు చెయ్యి. అంతేకాని, ఇరుకుగా ఉన్న ఇత్తడి కోటలో అయిదారు గుప్పిళ్ళ మట్టి పోసి తులసి మొక్క పెట్టి రోజు మొత్తానికి ఒక గ్లాసుడు మడి నీళ్ళు అందులో పోసి పూజ మాత్రం అరగంట చేస్తే ఆ తులసి మొక్క ఎలా ఎదుగుతుందే? ఆ మొక్కలో ప్రాణం ఎలా నిలబడుతుందే? ఇదేం భక్తి — నీ మోహం కాకపోతే?" అని విసుక్కునేవాడు. అప్పుడు హైమ ఏమనేదో తెలుసా?

"మీకేం తెలియదు. పూరుకోండి. బోలెడు మట్టి పోసి, బస్తాడు ఎరువు పోసి, గంగాళం నీరు పోసి పెంచడానికిదేం పళ్ళ చెట్టా? కాయల చెట్టా? ఏదో తులశమ్మ ప్రతి ఇంటా ఉండాలి. ఆ తల్లి ప్రతిరోజూ మన పూజ అందుకోవాలి. మనను చల్లగా చూడాలి అంటాను గదా అవి! అది


ఎండగా కూడదు! ఎండా కూడదు! చెట్టు పూర్తిగా ఎదిగితే తరువాతి దశ ఏమిటి? ఎండిపోవటం కదూ? అమ్మయ్యో! తులసి చెట్టు ఎండిపోతే ఎంత అనర్థం! ఎంత తప్పు! మీరు అడ్డమైన గుడ్డలతో నీళ్ళు పొయ్యకండి— మీకు పుణ్యం వుంటుంది. తులశమ్మను మామూలు చెట్టుగా చూడమని అనటంలోనే తెలుస్తోంది—మీ తెలివి తక్కువతనం. అందుకే అన్నాను మీకేం తెలియదని.''

తనకూ, తులసి మొక్కకూ ఎంత పోలిక! తను ఎండగాకూడదు, ఎండా కూడదు! తనేం పెద్ద ఆఫీసరా, మంత్రా బోలెడు డబ్బిచ్చి కూర్చోపెట్ట డానికి? ఆరు నెలలకు ఒక సారి జీత మిచ్చి ఇరుట్ట ఇంట్లో ఉండనిస్తున్నారు. రోజూ తులసి మొక్క లాగే నమస్కారా లందుకోవాలి! ఏటా తులసి పండుగ చేసి, పూజలు చేసి మొక్కులు తీర్చమని వేడుకుంటారు. ఏటా గురు పూజోత్సవం చేసి తనను సత్కరించాలని సూచించారు మంత్రిగారు. రోజుకో గ్లాసుడు నీళ్ళు పోసి తులసిని బతికిస్తోంది హైమ. తోచినప్పుడు నాలుగు జీతంరాళ్ళు పడేసి బతికిస్తున్నారు ప్రభుత్వం వాళ్ళు. నేనందరికీ పాఠాలు బాగా చెప్పాలి. భావి భారత పౌరులను తీర్చి దిద్దాలి. అందరి ఇంటా దీపాలు వెలిగించాలి. సమాజాన్ని, దేశాన్ని ముందుకు నడిపించే యువతను తయారు చెయ్యాలి. కాని, నాకు కూడు, గూడు ఏవి? తులశమ్మకు నోరు లేనట్లే నాకూ నోరు లేదు. తులశమ్మ వడలిపోయి తన బాధను వ్యక్తం చేస్తుంది. తను వడలిపోయిన ముఖంతోను, మాసికలేసిన బట్టలతోను తన పరిస్థితిని వ్యక్తం చేసుకుంటాడు. తులసి పరిస్థితి తెలుసుకోవటానికి హైమకు ఇంగితం లేదు. తన పరిస్థితి తెలుసుకోవటానికి ప్రభుతకు ఇంగితం లేదు. హైమ చేసే పూజలకు, పెట్టే దండాలకు, చేసే ప్రదక్షిణాలకు కొదవలేదు. ప్రభుత చేయించే సన్మానాలకు, కాళ్ళకు పెట్టే దండాలకు, వేసే దండలకు కొదవలేదు!'

''ఇప్పుడు పంతులుగారి ప్రియ శిష్యురాళ్ళలో ఒకరైన కుమారి సుహాసిని వారి యెడల తనకు గల గౌరవాభిమానాలను పురస్కరించుకొని కొన్ని మాటలు చెబుతారు.''

సుహాసిని స్టేజి మీదికి వచ్చింది. మైకు ముందుకు వచ్చి ఒయ్యారంగా నిలబడింది. పెద్ద జరీ అంచున్న ఆకుపచ్చ కంచి పట్టు లంగా, అదే రంగు పట్టు జాకెట్టు, ఆకుపచ్చ అమెరికన్ షిఫాన్ ఓణీలో సుహాసిని మెరిసిపోతూంది. ఆకుపచ్చని హైహీల్స్, ఆకుపచ్చ స్ట్రాప్ ఉన్న వాచీ, పచ్చరాళ్ళ ఒంటి పేట నెక్లేస్, రెండు జతల వెడల్పు బంగారు గాజుల మధ్య ఆకుపచ్చ గాజులు, చెవులకు ఆకుపచ్చ రాళ్ళ లోలకులు. వదులుగా వేసిన జడకు ఒక పక్కగా పెట్టుకున్న ఆకులతో ఉన్న గులాబీ పువ్వు. అచ్చం వన కన్యలా ఉంది సుహాసిని.

అందర్నీ ఆకర్షిస్తున్న ఆ అమ్మాయి ఏం చెబుతుందో వినాలని అంతా చెవులు రిక్కించుకొని కూర్చున్నారు. హాలంతా నిశ్శబ్దం. వీరభద్రరావు గారు మందహాసం చేస్తూ ఆమె వంక ఆప్యాయంగా చూస్తున్నారు. దివి నుండి భువికి దిగి వచ్చిన పసిడి కన్య. వనకన్య. పంటపొలం. దేవేంద్రుడి మెడ నలంకరించే పచ్చల కంఠాభరణం నుంచి రాలి వేదిక మీద మైకు ముందర పడిన పచ్చల తునక. సుహాసినిని చూడగానే ఇవన్నీ పంతులుగారి మస్తిష్కంలో కదలాడాయి. అంతలో ఆయన ముఖం ముడుచుకు పోయింది. మందహాసం మందగించింది. చిరిగిన లంగా, ఓణీలతో బయటికి రాలేక సిగ్గుతో ముడుచుకుపోయి, ముప్పాతిక మూడు వంతులు ఇంట్లోనే గడిపే కమల, విమల గుర్తు వచ్చారు. తండ్రి పరిస్థితి తెలిసి బట్టలు కొని పెట్టమని అడగలేక, చిరుగులు చింపులు కట్టుకోలేక తనవంక జాలిగా చూసే తన కన్నకూతుళ్ళు కళ్ళ ముందర కదలాడారు. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. వెధవ కన్నీళ్ళు! వీటికి వేళాపాళాలేదు. ఏ సమయంలో బయటికి రావాలో తెలియదు. కన్నీళ్ళు రాకుండా కూడా తను చాలా సార్లు ఏడ్చాడు. మరి ఇప్పుడీ




శుభ సమయంలో ఈ కన్నీళ్ళేమిటి? అయ్యయ్యో? చెంపల మీదుగా జారబోతున్నాయి. ఉత్తరీయంతో తుడుచుకోక తప్పేటట్టు లేదు. తుడుచుకున్నాడు.

''మాస్టారూ! కంట్లో నలక పడిందా? ఏమైంది, మాస్టారూ?'' కార్యదర్శి అడిగాడు.

''ఆనంద బాష్పాలండీ! ముసలి ప్రాణం ఎంత సంతోషిస్తోందో! ఈ సంబరానికి ఎంత సంబర పడిపోతున్నాడో పంతులు—చూడండి! అందుకే గురు పూజోత్సవం నాడు పంతుళ్ళను తప్పకుండా సన్మానించాలని పట్టుపడతాను నేను.'' మంత్రిగారు అన్న మాటలు మైకులో స్పష్టంగా వినిపించాయి. సుహాసిని చిరునవ్వుతో ప్రసంగం ప్రారంభించింది.

''గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః.

''నాలుగవ ఏటనే లోయర్ కె. జి. లోనే వచ్చీ రాని మాటలతో నేర్చుకున్న ఈ శ్లోకం నా మనస్సులో శాశ్వతంగా నిలిచిపోయింది. ఈ శ్లోకం నూటికి నూరుపాళ్ళు మాస్టారుగారికే వర్తిస్తుందనటంలో అతిశయోక్తి ఏమాత్రం లేదని నేను మనఃస్ఫూర్తిగా నమ్ముతున్నాను.''

చప్పట్లు పేలిపోయాయి. పోటీపడి మరీ కొట్టారు. చేతులు కందిన విషయం కూడా వాళ్ళు పట్టించుకోలేదు.

''వారు ఒక్కొక్క పద్యానికి అర్థం తాత్పర్యం ప్రతిపదార్థం చెబుతూంటే వ్యాసమహర్షో, వాల్మీకి మహాముని నా ముందు నిలబడి చెబుతు... భూతి నాకు చాలా సార్లు కలిగింది. నే... వారి క్లాస్ మిస్ కాలేదు. వారి క్లాస్ మిస్ ... జీవితంలో చాలా మిస్ అవుతానేమో నని నా ...

కిస్ మిస్ లాగా తియ్యగా మాట్లాడు... మిస్ సుహాసిని ఇంకా చాలా చాలా ...

''ఆయనకు రిటైర్‌మెంట్ రాకూడదు ... విద్యార్థి లోకానికి తీరని నష్టం ...

ఆయనకు దీటైన ఉపాధ్యాయులు లభించ... అంత తేలికైన విషయం కాదు. వారిని గురించి ఎంత చెప్పినా ఇంకా కొంత మిగులుతూనే ఉంటుంది. విద్యార్థి సంఘం తరఫున నేను ఈ సన్మాన పత్ర పటాన్ని, కీర్తిశేషులు రాధాకృష్ణన్ గారి పటాన్ని, పూల గుత్తిని, పూలదండను మా మాస్టారుగారికి వినయ పూర్వకంగా సమర్పించుకొంటున్నాను.''

కరతాళ ధ్వనులు మిన్నంటి మారుతున్నాయి. కళ్ళ ముందు మాత్రం చవుడు రాలుతున్న గోడలు, వాటికి తగిలించిన రాధాకృష్ణన్ ఫోటో, సన్మాన పత్ర పటం, ఎండిపోయిన పూలగుత్తి, పూల మాల కనపడుతున్నాయి.

సుహాసిని పేరుకు తగ్గట్టుగా చక్కని చిరునవ్వు నవ్వి, సభికుల కందరికీ నమస్కరించి మైకులో అంది: ''నన్ను మనసారా ఆశీర్వదించమని మాస్టారు గారిని వేడుకుంటున్నాను.'' గబగబ వచ్చి పాదాభి

వందనం చేసింది. మాస్టారుగారు గట్టిగా ఆశీర్వదించారు. "పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగం చేసే ధనవంతుడు గుణవంతుడడైన భర్తకు అనుకూలవతి అయిన భార్యవై సత్సంతానాన్ని కని సుమంగళిగా ముని మనుమలను ఎత్తుకో, తల్లీ!

ఆ అమ్మాయి వేదిక వెనక్కు వెళ్ళి పోతూంది. చూస్తున్న మాస్టారుగారి మదిలో మళ్ళీ అలజడి మళ్ళీ స్వగతం: 'నా బిడ్డల్ని ఇలా ఆశీర్వదించ గలనా? పెద్ద చదువులు చెప్పించ లేను. పెద్ద ఉద్యోగాలు ఇప్పించ లేను. గుణం సంగతి తెలియదు కాని, ధనవంతుడైన భర్తను తేలేను. కమల ఎదురింటి కాలేజీ స్టూడెంటుతో కిలకిల నవ్వుతూ మాట్లాడుతూంటే పెళ్ళి కాని పిల్లవు, అతనితో నీ కా మాటలేమిటి? సిరగబడి ఆ నవ్వేమిటి? పద లోపలికి అని తిట్టలేక పోయాడు. అవును మరి! ఎల్లా తిట్టగలడు? అమ్మ పెట్టా పెట్టదు. అడుక్కు తినా నియ్యదు. అన్నట్టు తను పెళ్ళి చెయ్యలేడు. ఆమె తనంతట తను జంటను వెతుక్కుంటే తను సైంధవుడిలా అడ్డు పడ్డం ఎందుకు?

నాన్నా! నేను, ఇతను ప్రేమించుకున్నాం. పెళ్ళి చేస్తావా? అని అడిగినా కష్టమే! తన దగ్గర ఏముందని పెట్టి పెళ్ళి చేస్తాడు? తనేం నిలవ వెయ్యగలిగాడు? నిలవ సంగతి దేవు డెరుగు! భుక్తి గడవటమే కష్టంగా ఉందే! కుర్రవాడు మంచివాడే. అతడు దాన్ని లేవదీసుకుపోతే బాగుండును. పైకి తిట్టినా లోపల సంతోషిస్తాడు! అదీ సుఖపడుతుంది. దానికి తిండి పెట్టే బాధా తప్పుతుంది.

"ఆరేళ్ళ ఆఖరి కూతురుకి ఎప్పుడూ రోగాలే. దరిద్రుల నాశనంచుకునే ఈ రోగాలు కాలం వెళ్ళబుచ్చుతాయి కాబోలు! ఇంగ్లీషులో మెర్సీ కిల్లింగ్ అంటారే—అదైనా లేదు మన దేశంలో. దానికి రోగం తగ్గదు. భగవంతుడు తీసుకు పోడు. మందులకు, పాలూ పళ్ళకు డబ్బు పొయ్యలేక ప్రాణాలు పోతున్నాయి. ఈ మాటలు పైకి అనగలడా? గుండెలోనే నొక్కి పెట్టేశాడు. అన్నాడో—తను రాక్షసు డన్న మాటే! అదీ ఒక విధంగా చావలేక బతుకుతూంది. నేనూ మరొక విధంగా చావలేక బతుకుతున్నాడు. ఆ మాటకు వస్తే ఇంట్లో అందరూ అంతేగా? హుఁ! ఏ తండ్రి అయినా ఎదిగిన పిల్ల లేచి పోవాలని, జబ్బుల పిల్ల చావాలని కోరుకుంటాడా? ఇదే నా తన పిల్లలకు తనిచ్చే ఆశీర్వాదం.'

"ఇప్పుడు మాస్టారుగారు ప్రసంగిస్తారు." కార్యదర్శి తరవాత కార్యక్రమాన్ని ప్రకటించారు. వికలమైన మనస్సుతో మాస్టారు లేచి నించున్నారు. జీతాలు నెల నెలకూ రావడం లేదనీ, కుటుంబం దైన్యస్థితిలో ఉందనీ, జీతాలు వెంటనే చెల్లించవలసిందనీ, పండ ఎడ్వాన్సులు, ప్రావిడెంట్ ఫండ్ లోన్ ఇప్పించమనీ ప్రార్థిద్దామనుకున్నాడు. కాని, గొంతు మరో రకంగా మాట్లాడింది.

"ఈ సన్మానానికి నేను అర్హుడి నేనా అన్న సంశయం నన్ను బాధ పెడుతూంది. ఈ ఆనందాన్ని మీ అందరితో పంచుకో గలగటం నా అదృష్టం. ఇది నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఇంతకు మించిన తృప్తి నా జీవితంలో మును పెన్నడూ రాలేదు. ఇక ముందు రాబోదు. ఈ ఆనంద సాగరంలో మునిగి తేలుతున్న నేను ఇంతకంటే ఎక్కువ మాట్లాడ లేకపోతున్నాను. అందరికీ నా కృతజ్ఞతలు. సర్వే జనా సుఖినో భవంతు."

"మా సన్మానం అందుకోవటానికి దయతో అంగీకరించిన మాస్టారుగారికి, ఎన్నో పనుల ఒత్తిడిలో ఉండి కూడా మేము అడగగానే ఒప్పుకొని తమ అమూల్య కాలాన్ని మా మధ్య గడిపిన మంత్రి వర్యులకు, సభను జయప్రదం చేయుటంలో తోడ్పడిన గౌరవనీయులైన అధ్యాపక బృందానికి, సుశిక్షితులైన విద్యార్థినీ విద్యార్థులకు మా హృదయ పూర్వక వందనాలు అర్పిస్తూ సభను ముగిస్తున్నాము." నమస్కారములు, ప్రతి నమస్కారాలు అయిపోయినాయి. మంత్రిగారు పోలీసు బృందంతో ఆడంబరంగా వెళ్ళిపోయారు. తరవాత స్కూటర్లు, మోటారు సైకిళ్ళు వెళ్ళాయి. ఆ తరవాత రిక్షాలు, లూనాలు వెళ్ళాయి. ఆ తరవాత సైకిళ్ళు వెళ్ళాయి. స్త్రీలకు రక్షనిస్తూ రిక్షాలు వెళ్ళి పోయాయి. మాస్టారు కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరారు. చేతిలో పటాల బరువు, చేతి సంచిలో దండలు, ఆపిల్ పళ్ళ బరువు. ఆవరణ బయటికివచ్చి కొన్ని గజాలు నడిచారు.

"నమస్కారం మాస్టారూ! జ్ఞాపక మున్నానా? పదేళ్ళ క్రితం నేను మీ విద్యార్థిని. పేరు విశ్వనాథ్. మీరు మరిచిపోయారేమోకాని, నాకు మీరు బాగా గుర్తున్నారు, సార్! ఏమిటీ దండలూ, హడావిడీ? ఓహ్! ఈవేళ సెప్టెంబర్ 5వ తారీకు కదూ! గురు పూజోత్సవం జరిగిందా? మీకు సన్మానం జరిగిందా? మాస్టారూ! చాల సంతోషమండీ! సార్! ఈ శుభ సందర్భంలో నా అభ్యర్థన కాదనకండి! హోటల్ కు వెడదాం రండి, మాస్టారూ! నో అనరు కదూ?"

"సరే పద, నాయనా! అంత ప్రేమగా పిలిచే వాళ్ళు మాత్రం ఎవరు ఉన్నారు?" వెజిటబుల్ పలావు, సమోసాలు, గులాబ్ జామ్, బాదం టీరు వద్దు వద్దంటున్నా బలవంతంగా తినిపించాడు విశ్వం.

"మిలిటరీలో ఇంజనీర్ గా ఉన్నాను, మాస్టారూ! సెలవులకు వచ్చాను. మీరు నేర్పిన విద్యా బుద్ధులు మా జీవితాలకు మార్గం చూపాయి, మాస్టారూ!"

"సంతోషం నాయనా! బాబూ విశ్వం! నీ భార్యా పిల్లలు ఎక్కడ ఉన్నారు?"

'పెళ్ళి కాలేదు. బ్రహ్మచారినే, మాస్టారూ?' అంటే బాగుండ దనుకుంటూ మెల్లగా అడిగారు.

"ఇంకా పెళ్ళికాలేదండీ! మిమ్మల్ని పిలవకుండా చేసుకుంటానా?"

"అల్లాగ! అది సరేకాని, నా మాట కాదనక మా ఇంటి కొక్కసారి రా, బాబూ! కాస్సేపు మాట్లాడుకుందాం."

'మా విమల నీకు నచ్చుతుందేమోనని ఆశ, విశ్వం.' స్వగతం స్వతంత్రించింది.

"అల్లాగే, మాస్టారూ! పదండి."

ఏదో నెపం మీద విమలను పిలిచారు మాస్టారు.

విమల వచ్చింది.

"ఇది మా అమ్మాయి, విమల."

"నమస్కారమండీ!" విమల చేతులు జోడించింది.

"అన్నయ్యకు చెల్లాయి నమస్కారం పెట్టడమేమిటమ్మా?"

విశ్వం వారించాడు.

మాస్టారు నెత్తిని పిడుగు పడింది.

ఒక ఏడాది కాలం నత్త నడక నడిచింది. మళ్ళీ ఈ వేళ గురు పూజోత్సవం. రామకృష్ణయ్యకు సన్మానంట. సంతోషం.

పైన తులసి పూజ మానలేదు.

విద్యార్థులు నమస్కారాలు పెట్టడం మానలేదు.

జబ్బు కొడుకు బాగుపడలేదు.

విమలకు అన్నగా వచ్చిన విశ్వానికి బావమరిది దొరకలేదు.

కమల కాలేజీ కుర్రవాడితో లేచిపోలేదు.

కడసారిది కన్ను మూయలేదు.

గుడ్డితనం పోయి మెల్లవచ్చినట్టుంది.

జీతంమాత్రం నెలనెలా అందుతూంది. ★

